మనస్ఫూర్తిగా ప్రేమించి పెళ్లి చేసుకుందామనుకున్న అతన్ని ఆమె ఎందుకు అసహ్యించుకుంది?

రాగతి రమ
కథ

# ప్రేమ పరీక్ష

**రాగిణీ!!** సీతారామయ్యగారి కంఠం మారు మ్రోగింది ఆ భవనం అంతా. ఆ భవనంతోపాటు రాగిణి కూడా ఒణికిపోయింది.

భయాందోళనలతో ఆయన వేపు చూసింది రాగిణి.

"రాగిణీ! ఎప్పుడూ నేను కోరేది నువ్వు సుఖంగా వుండాలనే అమ్మా"— ఆయన కంఠం మెత్తగా ఒణికింది.

"మన డబ్బును చూసి కాదమ్మా నిన్ను నిన్నుగా ప్రేమించి పెళ్ళి చేసుకున్న వాడితోనే నీ జీవితం సుఖవంతం అవుతుందమ్మా."

"రజనీ కాంత్ నన్ను నన్నుగానే ఇష్టపడ్డాడు నాన్నా" అంది ఆమె మనసు.


"నువ్వు ఎమ్మే చదివావు— అతను డిగ్రీ కూడా పూర్తిచేయలేదు. నువ్వు లక్షల కధిపతురాలివి— డిగ్రీయే పూర్తికాకుండా ఉద్యోగానికి వెంపర్లాడుతున్నాడు."

ప్రేమకు డబ్బుతో పనిలేదు నాన్న! అని బాధగా మూలిగింది ఆమె మనసు. ఆ మాట ఆమె గట్టిగానే అంది.

"అని నువ్వనుకుంటే సరిపోదమ్మా... ఈ రోజుల్లో ఎన్ని మోసాలు జరుగుతున్నాయో నీకు తెలీదు... పసిదానివి... ఈ సమాజాన్ని కాచివడబోసానమ్మా.

ప్రతి పని వేనకాలా డబ్బే నిలిచివుంది.

మనం కోరుకున్న ఏ వస్తువునైనా పరీక్షించే కొనుక్కుంటాం. మేలైనదా... కాదా? అని... ప్రేమను పరీక్షించడంలో తప్పు లేదమ్మా....ఆ ప్రేమ నీ కోసమా? లేక నీ డబ్బుకోసమా! అనేది ముందు



తెల్చుకోవాలి..."

రాగిణి ఆలోచిస్తూ నిలబడింది.

"అప్పుడు నాకే అభ్యంతరమూ లేదు రాణీ...." సీతారామయ్యగారు ఒకసారి కూతురు మొఖంలోకి చూసి – గంభీరంగా "ఇక వెళ్ళు" అన్నారు.

* * *

రాగిణికి ఆ రాత్రి నిద్రపట్టలేదు.

మనసు పరిపరి విధాల పోతూవుంది. తనను చేసుకుంటే రజనీకాంత్— తన ఫ్యాక్టరీకి ఈ ఇంటికి అధిపతి అవుతాడు. అందుకోసమే తనంటే పడి చస్తున్నాడా? అది వాస్తవం అవయివుండదని ఆమె గట్టిగా నమ్ముతూవుంది. అయినా ఒక్కసారి అతన్ని పరీక్షిస్తే ఏంపోయింది అనుకుంది రాగిణి.

* * *

అందమైన తోట మధ్య ఆకుపచ్చని రంగులో టీవిగా, ధగధగా మెరిపి పోతున్న రాగిణి వాళ్ళ బంగళాకు కొంచెం దూరంలో చిన్న పెంకుటిల్లు. అది రజనీ కాంత్ అక్కగారిల్లు.

ఆమె భర్త ఏదో ఆఫీసులో గుమస్తా. ఆమె కలిగిన వాళ్ళ ఇళ్ళకెళ్ళి ఎంబ్రాయిడరీ నేర్పిస్తూ వుంటుంది.

రాగిణికి కూడా నేర్పిస్తూ వుందామె. అప్పుడప్పుడు రాగిణీ కూడా ఆమె ఇంటికెళ్ళడం అలవాటు. అలాగా అతని అక్కతో మంచి దోస్తి ఏర్పడింది. అక్కడ దొంగ చూపులు చూస్తూ అటూ ఇటూ తచ్చాడే రజనీ కాంత్‌ని చూసి తనలో తాను నవ్వుకునేది రాగిణి. చాలా స్మార్ట్‌గా వున్నాడనికూడా అనుకుంది.

రజనీకాంత్ తల్లీ తండ్రీ పల్లెటూర్లో వుంటున్నారు. రజనీకాంత్‌కి చదువ బ్బలేదు. వ్యవసాయం మీద మనసు లేదు. తల్లీ తండ్రీ పోతే ఉద్యోగప్రయత్నం మీద అక్కగారింటికి వచ్చి వుంటున్నాడు.

రాగిణిని చూసినప్పుడల్లా అతనికి ఆమెని చేసుకునేవాడు ఎంత అదృష్టవంతుడో అనిపించేది.

* * *

ఒక రోజు కాలేజీ ఫంక్షన్‌కని వెళ్ళింది రాగిణి. అందంగా మెరుపు తీగలా తయారైంది. రాత్రి ఎనిమిదిన్నర అయింది. కారుకోసం ఎదురు చూస్తూవుంది. కారుజాడ లేదు. తొమ్మిది గంటలు దాటింది. ఫంక్షన్ పూర్తయింది.

స్నేహితురాలితో కలిసి బస్సుస్టాపులో నించుంది. కారు ఎందుకు రాలేదా అని ఆలోచిస్తూ వున్నప్పుడే స్నేహితురాలు వెళ్ళే రూట్ బస్సు రావడం, ఫలానా నంబరు బస్సు ఎక్కు అని చెప్పి వెళ్ళిపోవటం జరిగింది.

బస్సు స్టాపులో ఒక్కత్తే. దానికి తోడు చీకటి. వెళ్ళిపోయే ఎవరో ఇద్దరు ఆగి ఆ ఆమెను చూస్తున్నారు వెకిలిగా.

ఒక స్త్రీ ఒంటరిగా చీకటివేళలో నించుంటే వెకిలి మనసుగల మగజాతి వెకిలి గానే చూస్తుంది మరి, అంతకంటే పెద్ద మనసు ఏ కొందరిలోగాని అందరికీ వుండదు కదా! ధడధడ మంటున్నాయి గుండెలు. వెధవబస్సు ఇంకారాదేం?

ఒకడు ఈల వేశాడు. మరొకడు చిలక పిటపిటలాడిపోతూవుంది అన్నాడు.

ఇంతలో సర్రున ఒక స్కూటర్ ఆగింది. దానిమీద చదువుకున్న మహారాజునని మురిసి పోతున్న సోగ్గాడొకడు "అరె బాప్... ఇక్కడున్నారు ఏం కథ...?"

అని అడిగాడు రాగిణి వేపు అదోలా చూస్తూ.

"మల్లెపూల సువాసనకి" ఒకడన్నాడు.

గొల్లుమని నవ్వారు మిగతా ఇద్దరు.

రాగిణికి ముచ్చెమటలు పోశాయి.

ఇంతలో మరొక స్కూటర్ ఆగింది.

ఇప్పుడెలా ఇక్కడినుండి బైటపడాలా అని ఆలోచిస్తూ వుంది.

రాగిణీ... రాగిణీ? అని ఎవరో పిలుస్తున్నారు. ఇంతలో ఎవరో చేయి గుంజారు. కెవ్వుమన బోతూ చూసింది.

రజనీకాంత్— సన్నని చిరునవ్వుతో—

"కమాన్— రండి" అంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడు. అతన్ని గట్టిగా పట్టుకుని కూర్చుంది. ఆమె చెయ్యి ఇంకా ఒణుకుతూనే ఉంది.

"దిగండి!" అనేవరకు ఆమెకు స్పృహ లేదు. ఇంకా అతన్ని తను గట్టిగా పట్టుకొని వుండటం చూసి సిగ్గుపడింది రాగిణి.

ఆ రాత్రి ఆమెకు నిద్ర కరువైంది. నిద్రలో కలలు—కలల నిండా రజనీకాంత్ రూపమే పదేపదే!

ఆ రాత్రి రజనీకాంత్‌కి నిద్రకరువైంది. ఆమెని పెళ్ళాడే అదృష్టవంతుడు ఎవరా అని పదే పదే ఆలోచిస్తూ నిద్ర దూరం చేసుకున్నాడు.

ఆ తర్వాత వాళ్ళిద్దరు ఎన్ని సార్లో కలుసుకున్నారు. కలిసి బీచ్‌కి వెళ్ళారు. మనసు విప్పి మాట్లాడుకున్నారు.

* * *

సాయంత్రం ఐదు గంటలైంది. చల్లని సముద్రపు గాలి మనసుని గిలిగింతలు పెడుతుంటే ఇసుకలో కూర్చుని రాగిణి కోసం ఎదురు చూస్తున్నాడు రజనీకాంత్.

కారుదిగి, ఏదో ఆలోచిస్తూ గంభీరంగా ఇసుకలో నడిచి వస్తున్న రాగిణిని చూసి ఆశ్చర్యపోయాడు రజనీకాంత్.

ఆమె వచ్చి అతని ప్రక్కగా కూర్చుంది.

ఇద్దరిమధ్యా కాసేపు నిశ్శబ్దం!

"రాణీ ఎందుకలా వున్నావో చెప్పవూ?" అడిగాడు ఆమె చెయ్యి నొక్కుతూ.

"మా బావ ఫారన్ నుండి వస్తున్నాడు" అంది. అతను వింటున్నాడు.

"మా బావతో నాకు పెళ్ళి జరగాలని

## నరకం



ఫుల్ తాగి బస్సెక్కాడు మందేశ్వరరావు. అతని వాలకం చూసి పక్కనేవున్న ఓ పర్ఫాదర్.

"నాయనా... ఇలా అయితే నువ్వు తిన్నగా నరకానికే పోతావ్" అన్నాడు సౌమ్యంగా.

"అలాగే... అయితే అర్జంటుగా బస్సాపండి. నేను పొరబాట్న ఈ బస్సెక్కాను" అంటూ అరవ సాగాడు మందేశ్వరరావు.

జంగాల అజయ్‌కుమార్
(గుంటూరు)

మా నాన్నగారు గట్టిపట్టుపడుతున్నారు''
అతను ఎటో చూస్తూ అన్నాడు. ''అవును చేసుకో... సుఖసంతోషాలతో హాయిగా వుండు''.
రాగిణి నవ్వుతూ చూసింది. ''రజనీ కోపమా? ఎప్పుడైనా నేను అలా చేస్తానని నువ్వు అనుకుంటున్నావా? ఈ సంపద, ఈ మేడా కారు ఇవేమీ నాకు లేకపోయినా ఫర్వాలేదు.
''మీ డాడీ వూరుకుంటారా?''
ఇంకేం చేస్తారు? మా బావను చేసుకోకపోతే ఇవేమీ నావి కావు''
''అంటే?'' అతనాశ్చర్యంగా అడిగాడు.
''అవును రజనీ, ఈ సంపద ఈ ఫ్యాక్టరీ అంతా మా అత్తది. సినిమా వ్యామోహంలో పడి ఆస్తంతా పోగొట్టుకున్న మా నాన్నని చేరదీసింది. మా అత్త చనిపోతూ మా బావని గార్డియన్‌గా నియమించింది. ఇప్పుడు మా బావ ఫారిన్ నుండి తిరిగి వస్తున్నాడు. మా బావ నన్నే పెళ్ళి చేసుకోవాలని మానాన్న వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంటున్నారు.
ఆమె ఆగి అతని ముఖంలోని భావాలను చదవడానికి ప్రయత్నించింది.
నాకు మాత్రం ఆ పెళ్ళి ఇష్టంలేదు.
అప్పుడు నవ్వాడు రజనీకాంత్.
''నాకు మాత్రం ఇష్టమా... ఎప్పటికీ నువ్వు నా దానివే రాగిణీ?''
''నేను ఏదో ఉద్యోగం చూసుకొని నా కాళ్ళమీద నేను నిలబడి నిన్ను పోషించుకుంటాను. పువ్వుల్లో పెట్టి పూజి ంచుకుంటాను'' అతను ఉద్వేగంతో ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

''నిన్ను నిరాశ పరచాను కదూ?''
''దేనికి...?''
నేను గొప్ప లక్షాధికారిణినని నువ్వు అనుకున్నావు.
''నన్ను అనుమానిస్తున్నావా రాగిణీ...?''
అతను దీనంగా చూశాడు.
రాగిణి చప్పున అతని పెదవులు మూసింది.

* * *

ఎప్పటిలా రజనీకాంత్ ఆమె కోసం వస్తూనే వున్నాడు. బీచ్‌కి, షికారుకి వెళ్తానే వున్నాడు. ఆమె ఇంటికి వెళ్ళాలంటే బిక్కు బిక్కున వెళ్ళేవాడు. ఇప్పుడా సంకోచం ఏమీ లేదు. అతనిలో ఏ మార్పు కనిపించలేదు. అతని మీద ప్రేమ ఆమెకు రెట్టింపు అయింది.

* * *

రాగిణికి, రజనీకాంత్‌కి పెళ్ళి నిశ్చయం అయిపోయింది. పెళ్ళి వచ్చేనెల్లోనే.
షాపింగ్‌కి వెళ్దాం అన్న మనిషి ఇంకా రాకపోతే రజనీకాంత్ ఇంటికి నడిచింది రాగిణి.
అప్పుడు సమయం ఐదు గంటలైంది. చల్లగా, ఆహ్లాదంగా వున్న ఆ వాతావరణంలో నాజూకుగా నడుస్తూ మెట్లు ఎక్కింది.

తలుపు తట్టబోయి— నవ్వులు— మాటలు

వినిపించడంతో ఆగి వీధి కిటికీ గుండా లోనికి చూసింది.

రజనీకాంత్, ఎవరో ఇద్దరు ఫ్రెండ్సూ పేకాట ఆడుతున్నారు. "ఒరే బాప్ ఇక పేకాట కట్టేద్దాం—షాపింగ్‌కి తను ఎదురుచూస్తూ వుంటుంది."

"ఒరే మన రజనీ లక్షాధికారి అయిపోతున్నాడు— పట్టక పట్టక బంగారు చిలకనే పట్టాడు అలా వుండాలి..." ఒకడన్నాడు.

"వీడ్ని చూసి నేర్చుకోవాలిరా— మనమూ ఎవర్నయినా పడితే...!" నవ్వులు.

"ఆగండాగండిరా!" అన్నాడు రజనీకాంత్. "బంగారు చిలుకలు ప్రేమ పరీక్షలు కూడా పెడతారు. నాకూ పెట్టింది లేవోయ్— డబ్బంతా తన బావ సొత్తని. ముందే వాళ్ళ సంభాషణ విన్నాను కాబట్టి సరిపోయింది. లేకపోతేనా...!

బంగారు అవకాశం జారిపోను. అందుకే బాసూ .... బంగారు చిలుకల విషయంలో చాలా జాగ్రత్తగా డబ్బుకోసం కాదూ అవి వలేంచాలోయ్..."

నవ్వుతున్నారు పగలబడి.

రాగిణి గుండె బద్దలైంది.

"హీనుడా నా కళ్ళు తెరిపించావ్" అరిచింది రాగిణి.

"నీ మొఖం నాకెప్పుడూ కనిపించనివ్వకు" రాగిణి వచ్చేసింది.

రజనీకాంత్‌కి అవకాశం చేజారిపోయినందుకు దుఃఖం ఎగతన్నుకు వచ్చింది.



## రాణిగారి రసీదు

రాజుగారు తలుచుకొంటే దెబ్బలకు కొదువేమిటి? అనేది మనకందరకూ తెలిసిన సామెత. అయితే బ్రిటన్‌లో ఈ మధ్య అందుకు విరుద్ధంగా ఓ సంఘటన జరిగింది. బ్రిటన్ మహారాణి అయిన డయానా స్వయంగా లండన్‌లోని ఓ షాపుకు వెళ్ళి గౌనుకొనుక్కొందట. అయితే ఓ నాల్గురోజుల తర్వాత ముచ్చటపడి కొనుక్కొన్న ఆ గౌను పెద్దదయిందని మళ్ళీ షాపుకు వెళ్ళి దానిని మార్చుకొంటానందట. అయితే ఆ షాపుయజమాని దానిని కొన్న రసీదు చూపితేగానీ మార్చనన్నాడట. పాపం.. ఆమాటకు డయానా తలవాల్చుకొంది. దానికి కారణం ఆరసీదుపోవటమే. ఆమెగారి డిటెక్టివ్ అనేక విధాలుగా ఆమె ఆ గౌసును అదేషాపులో కొన్నట్లు రుజువు చేయటంతో కథ సుఖాంతమయింది. అయితే ఇంకోసారి రసీదు లేకుండా ఎలాటి మార్పిడీ జరగదని షాపు యజమాని స్పష్టంచేశాడట. సెహబాష్ ఇంతకీ ఆ గౌను ఖరీదు ఎంతనుకొంటున్నారు? మన కరెన్సీలో చెప్పాలంటే 350 రూపాయలు మాత్రమే!

జూపిటర్